# సెలవు కారణం

మంగళవారం ఆఫీసులో అడుగు పెట్టటంతోటే శ్రీముఖం అందించాడు గుమాస్తా రమణకి బంట్రోతు మంగయ్య. అనుకున్నంతా అయిందనుకున్నాడు రమణ.

అప్పుడే వస్తూన్న ఒక్కొక్క గుమాస్తా రమణమీద సానుభూతి చూపారు సంగతి తెలుసుకుని. దానినే ఇలా వ్యక్తం చేశాడు పెద్ద గుమాస్తా—'అవునోయ్ మరి! సెలవు పెట్టకుండా మానేస్తే ఎలా, అయ్యగారి సంగతి తెలిసికూడా. పీల కాకితం తెలుస్తుందిలే ఉండేలుదెబ్బ"

"సోమవారం రావటానికి వీలులేకపోయిందండి" అన్నాడు రమణ జాలిగా.

"సరేలే, ఆసంగతంతా మానేజరుగారితో స్వయంగా మనవి చేసుకో" అన్నాడు పెద్ద గుమాస్తా.

తోటి గుమాస్తాలు కొందరు నవ్వుకున్నారు. కొందరు విచారించారు రమణ స్థితిచూసి.

"టపాకి జరూరుగా పంపవలసిన కాగితాలకు జవాబులు రాసెయ్యండి" అన్నారు హెడ్ గుమాస్తా ప్రకృతాన్ని జ్ఞాపకం చేస్తూ.

ఐదింటివరకు కాగితాల మధ్య సతమతమౌతున్నాడన్న మాటేగాని మనస్సుమటుకు కళ్ళెం లేని గుర్రంలాగ వ్యవహరిస్తూంది రమణకి.

మానేజరుగారు ప్రక్క ఊరు తనిఖీకి వెళ్లారని ఆరోజు సాయంకాలానికి తిరిగి వస్తారని డఫేదారు చెప్పేడు రమణకి.

* * *

వీధి దీపాలు అప్పుడే వెలిగేయి. చలి కొంచెం కొంచెం తొంగిచూస్తూంది.

రమణ మానేజరు గారింటికి వెళ్ళేటప్పటికి ఆయన వీధిగదిలో ఒక్కడూ కూర్చుని కాగితాలు చూచుకుంటున్నారు రేడియో పాట వింటూ.

రమణ నమస్కరించాడు. అధికార పురస్సరంగా శిరఃకంపనం చేశారు మానేజరు.

"తమరితో స్వయంగా మనవి.. "

## యస్. కె. యస్. రామానుజాచారి

"ఏమని?" సగంలోనే అందుకున్నారు మానేజరు.

"నేను ముందుగా సెలవు పంపుకోలేకపోయిన పరిస్థితి."

"ఏం పరిస్థితయ్యా! ఆఫీసంటే కాలేజీలో క్రికెట్ ఆడటంలాగా వుంది మీ కుర్రకారుకి."

"అది కాదండి అయ్యా! మా అత్తవారింటికి శనివారం సాయంత్రానికి చేరుకున్నా, ఆదివారం ఉదయం మా ఆడవాళ్లని తీసుకు వచ్చేద్దామని."

"ఏమిటీ నీకు వివాహం అయిందా! ఐనా నీ సంసారం గొడవలన్నీ వింటూ కూర్చోవటానికి నాకు తీరిక లేదు. నువ్వు చెప్పదల్చిన దేదో కాగితంమీద చెప్పుకో."

"చిత్తం. కాగితం మీద రాయటానికి వీలులేని విషయం. అందుచేతనే తమతో స్వయంగా మనవి చేసుకుందామని వచ్చా."

కళ్ళజోడు తీసి బల్లమీద పెట్టేరు మానేజరు సందిగ్ధంగా.

"అత్తవారింటికి చేరుకున్న తరువాత తెలిసింది—మా వాళ్ళు ఇంట్లోకి రావటానికి వీలు లేదనిన్నీ, సోమవారం ఉదయం స్నానమనీ" అన్నాడు రమణ.

విడుపు ప్రారంభించిన చంద్రుడిలాగ అయింది ఆఫీసరుగారి ముఖబింబం. తల పైకి కిందికీ ఊపేరు ఆయన మౌనంగా.

మౌఖిక సంజాయిషీ ఆరంభించాడు మళ్లీ రమణ. "ఆదివారం టపా ఉండదు. ఈ విషయం కాగితంమీద రాయటానికి వీలు లేదు కనుక తమతో మంగళవారం ఉదయం స్వయంగా మనవి చేసుకుందామనుకున్నాను."

కేతువు నోటినుంచి పూర్తిగా విముక్తి చెందాడు చంద్రుడు.

"ఆఁ" అన్నారు అయ్యగారు కొంచెం గట్టిగానే.

"నీవు చెప్పింది నిజమే ననుకోవోయ్! కాని ఉద్యోగధర్మం ఉద్యోగ ధర్మమే! నీ గాథ నన్ను ముప్పై సంవత్సరాలు వెనక్కు తీసుకుపోయింది. అప్పుడు నేనూ నీలాగే మామూలు గుమాస్తాగా ఉన్నాను. సరిగా ఇలాగే..." అని ఆపేసి, "సరేలే! నీవు వెళ్ళు మొదటితప్పుకింద క్షమించాను. ఇకముందెప్పుడూ సెలవు పెట్టకుండా మానకు" అన్నారు మానేజరు.

సెలవు తీసుకొని మెట్లుదిగి రోడ్డుమీద అడుగుపెట్టిన రమణకి, "బాబీ, మీ అమ్మతో కాస్త కాఫీ ఇమ్మని చెప్పు" అన్న మానేజరు మాటలు వినిపించాయి.

ఇంటిదగ్గర శ్రీమతి వంటరితనం జ్ఞాపకం వచ్చి నడక వేగం హెచ్చించాడు రమణ తన ఇంటివైపు. ★

---

కథానాయకుడు పాల్ మ్యూని వరేసి. అద్భుతంగా పోషించాడా పాత్రను

ఆ చిత్రం నిర్మించింది సుప్రసిద్ధ నటీమణి నార్మాషెరర్ భర్త యిర్వింగ్ టాల్ బర్. పెరల్ బక్ రెండవనవల 'డ్రాగన్ సీడ్' చిత్రం అంతబాగా తీయలేదని పెరల్ బక్ అభిప్రాయం. తను వ్రాసిన 'డ్రాగన్ సీడ్' నవలలో కథానాయకురాలు మగవాడిలాగా పంట్లాం వేసుకునే అంతటి జాణ కాదు. కాని ఆ చిత్రంలో కథానాయికగా నటించిన కేథరీన్ హెప్ బర్న్ పంట్లాం వేసుకుంటానని పట్టుపట్టింది! డైరక్టరు కాదనలేకపోయాడు - దాంతో తను సృష్టించినపాత్ర దెబ్బతిన్నది. అందువల్లనే 'గుడ్ ఎర్త్' అంతగా ప్రజాదరణ పొందలేకపోయింది. 'డ్రాగన్ సీడ్' చిత్రం

ప్రశాంతమైన కొండప్రాంతాల్లో కనుచూపు మేరకు కనిపించే పచ్చికబయళ్లల్లో కొన్ని ఎకరాల పొలంతో కూడిన తోటలో వుండే తనయింట్లో కూర్చుని ప్రకృతి సౌందర్యాన్ని ఆరాధిస్తూ, పిల్లలో ఆడుకోడంలో తృప్తి పడుతుంది పెరల్ బక్.

బల్లమీద ఎప్పుడూ తెల్లకాగితాలు తన కలంకోసం ఎదురుచూస్తూవుంటాయి - తను రచయిత్రి. జీవితాంతంవరకూ ఏవో వ్రాస్తూనే వుంటుంది.

స్త్రీజాతికి గర్వకారణమైన పెరల్ బక్ రచనలు ప్రపంచఖ్యాతి నార్జించాయి. సారస్వతంలో నోబెల్ ప్రైజ్ పొందిన ఆమె జీవితానికి అంతకంటే కావలసిం దేముంది!

(పెరల్ బక్ వ్రాసిన 'మై సెవరల్ వరల్డ్స్' ఆధారంగా)

(అయిపోయింది.)